ప్రజాశక్తి
మంగళవారం 26 ఆగస్టు 2025
5
పార్వతీపురం మన్యం

వీరఘట్టంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

వీరఘట్టం : మండలంలోని సోమవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. గత మూడు రోజులుగా వర్షాలు లేనప్పటికీ ఆకాశంలో ఎటువంటి మబ్బులు లేనప్పటికీ సోమవారం వేకువ జాము నుండే వర్షంపడడంతో ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగా రహదారులు బురదమయంగా మారడంతో వాహనదారులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా వర్షాలు కురిస్తే క్యాబేజీ పంట నాశనమయ్యే అవకాశాలు ఉన్నాయని, కూరగాయల రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు వెచ్చించి విత్తనాలు కొనుగోలు చేసి పంట సాగు చేసినప్పటికీ ఈ కారణంగా నష్టాలు చూసే అవకాశాలు ఎక్కువగా ఉందని కూరగాయల రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో కురిసిన వర్షాల వల్ల ఇప్పటికే కొంత క్యాబేజీ పంట దెబ్బతిన్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏదయా యూరియా?

- ఎరువుల కోసం వర్షంలో రైతుల పాట్లు
- కొరత లేదంటూ అధికారుల బుకాయింపు
- అధికారుల ప్రణాళికా లోపం వల్లే కొరత
- వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు ఒకేసారి డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఎరువుల కొరత వెంటాడుతోంది. వ్యవసాయ శాఖ అధికారులపై తీవ్ర ఒత్తిడి ఉంది. పంటల సాగుకు అవసరమైన ఎరువులు దొరుకుతాయో లేదోనన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. ఎరువుల కొరత లేదని ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు జిల్లా కలెక్టర్‌తో సహా వ్యవసాయ అధికారులు చెపుతున్నా కిందిస్థాయిలో కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ముమ్మరంగా వర్షాలు పడుతుండడంతో వరి నాట్లు వేగవంతమయ్యాయి. మరోవైపు మొక్కజొన్న, పత్తి పంటల ఎదుగుదల, దిగుబడులకు ఇదే సమయంలో యూరియా, డిఎపి ఎరువుల అవసరం ఉంది. ఈ మూడు పంటల సాగు జిల్లాలో అధికంగా ఉంది. దీంతో తమకు అవసరమైన స్థాయిలో ఎరువులు అందుతాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. సరిపడే స్థాయిలో ఎరువుల పంపిణీ చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఎరువుల కొరత ఇలా వుంటే ముమ్ముందు అవసరాలకు సరిపడా సరఫరా చేస్తారో లేదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అన్ని మండలాల్లోనూ కొరత తీవ్రంగా ఉంది. యూరియా, డిఎపితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చుననే ఆలోచనలో రైతులు ఉన్నారు. కొంతమంది రైతులు ఒకటి లేదా రెండు, మూడు పంటల సాగులో ఉన్నారు. అలాంటి వారికి ఒకటి, రెండు యూరియా బస్తాలు సరిపోయే పరిస్థితి ఉండదు. దీంతో తమ అవసరాలకు సరిపడే స్థాయిలో ఎరువులు అందడం లేదనే ఆవేదన వారిలో కనిపిస్తోంది. ఇదే పరిస్థితి జిల్లా అంతటా వుంది.

వర్షంలోనూ క్యూలైన్లలో రైతులు

సాలూరు మండలం బోరబంద రైతు సేవా కేంద్రంలో సోమవారం ఎరువుల పంపిణీ జరిగింది. ఈ రైతు సేవా కేంద్రం పరిధిలో మొత్తం 750 మంది రైతులు ఉన్నారు. కానీ వారికి 267 బస్తాల యూరియా మాత్రమే సరఫరా అయింది. ఇంతకు ముందు 48 మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. బోదబంద రైతు సేవా కేంద్రం పరిధిలో ఐదు గ్రామాలు వున్నాయి. ఎరువులు అవసరమైన రైతులు ఎక్కువగా వుండడం, తక్కువ యూరియా రావడంతో రైతుల్లో ఆందోళన కనిపించింది. దీంతో వర్షం పడుతున్నా గొడుగులు పట్టుకుని క్యూలైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో తీసుకున్న వారికి ఇవ్వకుండా కొత్తగా అడుగుతున్న రైతులకు సోమవారం ఎరువుల పంపిణీ చేశారు. దీంతో రైతుల మధ్య తోపులాట జరగకుండా అధికారులు పోలీసులను రంగంలోకి దించాల్సిన పరిస్థితి నెలకొంది.

బోరబందలో ఎరువుల కోసం వర్షంలో కూకట్టిన రైతులు

ప్రణాళికా లోపం వల్లే కొరత

జిల్లాలో ఎరువుల పంపిణీ, అవసరాలపై వ్యవసాయ అధికారులకు సరైన ప్రణాళికా లోపం కారణంగానే ఎరువుల కొరత ఏర్పడినట్లు తెలుస్తోంది. ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి ప్రారంభం కానుంది. అంటే వ్యవసాయ శాఖ అధికారులు ఏప్రిల్ నుంచి ఎరువుల పంపిణీ చేపట్టారు. శనివారం నాటికి జిల్లాలో 14,338 మెట్రిక్ టన్నుల యూరియా, 7446 మెట్రిక్ టన్నుల డిఎపి పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం మొక్కజొన్న, పత్తి, వరి పంటలకు ఒకేసారి డిమాండ్ ఏర్పడినప్పుడు అధికారులు ఎరువులను పంపిణీ చేయడంలో తగిన జాగ్రత్తలు తీసుకోలేదు. రైతులు సాగు చేస్తున్న భూమికి సంబంధించిన వన్ బి పత్రాలను పరిశీలించి ఎరువుల పంపిణీ చేస్తున్నారు. అయితే ఇదే తరహాలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లోనూ ఎరువుల పంపిణీ జరగలేదు. ఆధార్ కార్డులను ఆధారంగా చేసుకుని ఎరువుల పంపిణీ చేయడంతో కొన్నిచోట్ల రైతులు కానివారికి కూడా పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ఈ అవకాశాన్ని కొంతమంది వ్యాపారులు వినియోగించుకుని ఎరువులను నిల్వ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఎరువుల కొరత ఉంటుందనే విషయం అధికారులకు తెలిసినప్పటికీ ఉదాసీనంగా వ్యవహరించారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాదిలో రాష్ట్రానికి ఎరువుల కోటాలో నాలుగు లక్షల టన్నుల ఎరువుల కోత విధించింది. దీని ప్రభావం జిల్లాకు రావాల్సిన కోటాపై కూడా వుంటుంది. అంటే ఎరువుల కొరత వస్తుందని అధికారులకు ముందుగానే తెలిసినా అందుబాటులో ఉన్న ఎరువులను ప్రణాళికా బద్ధంగా పంపిణీ చేయడంలో ఉదాసీనత కనబరిచారు. గత రెండు నెలలుగా ఎరువులకు డిమాండ్ పెరగడంతో రైతులు క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నానో ఎరువుల పాట ఎందుకు పాడుతున్నారు?

ఈ ఏడాది ఖరీఫ్ నుంచి వ్యవసాయ శాఖ అధికారుల నోట నానో ఎరువుల పాట వినిపిస్తోంది. యూరియా, డిఎపి ఎరువులకు బదులుగా నానో యూరియా, నానో డిఎపిలను వాడాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. సాధారణ యూరియా, డిఎపిల కన్నా నానో యూరియా, డిఎపిలు బాగా పని చేస్తాయని రైతుల్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ రైతులు సాధారణ ఎరువులే కావాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో అధికారులు నానో ఎరువులపై అవగాహన కల్పించేందుకు ప్రయత్నించడం వెనుక ప్రభుత్వం ఒత్తిడి వుందనే ప్రచారం సాగుతోంది. రాష్ట్రం ఎరువుల కోత ఎదుర్కొంటున్న నేపథ్యంలో నానో ఎరువుల గురించి రైతులకు అవగాహన కల్పించాలని ప్రభుత్వం అధికారులకు నిర్దేశించింది. దీంతో అధికారులు నానో ఎరువుల వాడకంపై అవగాహన కల్పించేందుకు ప్రయత్నించినా ఫలితం కనిపించడం లేదు. ఎరువుల కొరత వస్తుందని ముందే తెలుసుకున్న అధికారులు నానో ఎరువుల పాట పాడారనే వాదనలు వినిపిస్తున్నాయి.

అధికారుల సమక్షంలో ఎరువుల పంపిణీ

సీతానగరం : మండలంలోని పెదభోగిలి కోపరేటివ్ సొసైటీ సహకార సంఘానికి యూరియా వచ్చిందని తెలిసిన వెంటనే పెద్దభోగిలి, అప్పయ్యపేట, ఏగోటివలస, లక్ష్మీపురం, సీతానగరానికి చెందిన రైతులు రైతు సేవా కేంద్రాల వద్దకు చేరుకుని యూరియా కోసం క్యూకట్టారు. రైతులంతా ఒక్కసారి రావడంతో గందరగోళం ఏర్పడింది. దీంతో వ్యవసాయ శాఖ సహాయకులు మండల వ్యవసాయ శాఖ అధికారికి సమాచార అందించడంతో వెంటనే ఆయన తహశీల్దార్ జె.ప్రసన్‌కుమార్, పోలీస్ సిబ్బందితో రైతు సేవ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. అనంతరం వీరి ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు ఆధార్, భూమి పుస్తకం ఆధారంగా యూరియా పంపిణీ చేస్తామన్నారు. అలానే మండలంలో ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో వెంకటాపురం, రామవరం, మరిపివలస, వెంకటేశ్వర ఫెర్టిలైజర్, కొత్తవలస సొసైటీల్లో 12 మెట్రిక్ టన్నుల చొప్పున, అలాగే విజయరామ ఫెర్టిలైజర్స్ డీలర్ వద్ద 6 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. అలాగే సీతానగరం మండలంలో ఖరీఫ్ 2025 పంట కాలానికి సంబంధించి ఇప్పటి వరకు రైతు సేవా కేంద్రాలకు 562 మెట్రిక్ టన్నులు, అలానే డీలర్ వద్ద 158 మెట్రిక్ టన్నుల యూరియా ఇంకా రావాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద భోగిలి ఉపసర్పంచ్ కె.అరవింద్ కుమార్ సొసైటీ అధ్యక్షులు రాంబాబుతో పాటు పెద్దలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పెదబోగిలిలో అధికారుల సమక్షంలో ఎరువుల పంపిణీ

డిఆర్ఓకు వినతిని అందజేస్తున్న ఎన్‌పిఆర్‌డి సభ్యులు

వికలాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అర్హులైన వికలాంగుల పింఛన్లు కొనసాగించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యాన సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. తొలగించిన అర్హులైన వికలాంగుల పెన్షన్లు పాత శ్లాబ్‌లోనే ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయవేదిక (ఎన్‌పిఆర్‌డి) జిల్లా కన్వీనర్ గవర వెంకటరమణ, వికలాంగుల సంఘం నాయకులు గొర్లి వెంకటరమణ, ఎన్.సింహాచలం, ఎస్.నాగేశ్వరరావు, ఎం.దశరథలు కోరారు. ఎన్‌పిఆర్‌డి జిల్లా కన్వీనర్ వెంకటరమణ మాట్లాడుతూ గత పది రోజులుగా వికలాంగుల పింఛన్లు రద్దు చేస్తున్నట్లు పేర్కొంటూ ప్రభుత్వం నుంచి నోటీసులు అందజేస్తున్నారని చెప్పారు. అలా నోటీసులు అందుకున్న అర్హులైన వికలాంగులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. పింఛను రద్దయితే ఎలా బతకాలనే భయాందోళనలో ఉన్నారని చెప్పారు. వాస్తవానికి ఈ ఏడాది జనవరి నుంచి సదరం సర్టిఫికెట్లు పరిశీలన, వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. 85 శాతం కన్నా పైబడ్డ వారికి గతంలో రూ.15వేలు ఇవ్వగా, నేడు ఆ వైకల్యం శాతాన్ని తగ్గించి పింఛను శ్లాబును రూ.6వేలుకు మార్చివేశారని చెప్పారు. 60 ఏళ్ల వయసు పైబడ్డ వికలాంగుల పింఛన్లను రూ.15వేలు, రూ.6వేలు కేటగిరి నుంచి మార్చి వృద్ధాప్య పింఛన్ కేటగిరి రూ.4వేలకు తగ్గించారని తెలిపారు. పింఛన్ల రద్దు నోటీసులు అందుకున్న వారు తిరిగి అప్పీల్ చేసుకొని వైకల్యాన్ని నిర్ధారించుకుంటే ఫించన్ పునరుద్ధిస్తామని ప్రభుత్వం చెబుతున్నా ఆ ప్రక్రియ కఠినతరంగా ఉందని చెప్పారు. బోగస్ ఫింఛన్లు ఉంటే తొలగించవచ్చు కానీ ఆ పేరిట అర్హుల ఫింఛన్లు తొలగించడం సబబు కాదన్నారు. ప్రభుత్వం వికలాంగుల పింఛన్ల నిధులను భారీగా తగ్గించుకునే చర్యల్లో భాగంగా అర్హుల పింఛన్లు తొలగింపులకు పాల్పడుతున్నదని విమర్శించారు. వారి పింఛన్లు వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

వైసిపి ఆధ్వర్యాన...

కూటమి ప్రభుత్వం సంపద సృష్టిలో భాగంగా తీసుకున్న పెన్షన్ల తొలగింపు చర్యలను వెంటనే నిలిపివేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లను తిరిగి పునరుద్ధరించాలని మాజీ అలజంగి జోగారావు డిమాండ్ చేశారు. వికలాంగ విభాగం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ అధ్యక్షతన జిల్లా పరిధిలో గల వివిధ నియోజకవర్గాల నుంచి విచ్చేసిన వికలాంగ పెన్షన్ల బాధితలతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలగించిన పెన్షన్లను వెంటనే పునరుద్ధరించాలని, ఏ ఒక్క అర్హుడికీ అన్యాయం చేయకుండా జిల్లా అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేకూరేలా చూడాలని కోరారు. కొన్నేళ్లుగా ప్రభుత్వం నుంచి పొందుతున్న పింఛన్లను కూటమి ప్రభుత్వం అన్యాయంగా తొలగించడం దారుణమన్నారు. పర్సంటేజ్ తగ్గించడం, వేరే పెన్షన్‌లోకి విలీనం చేయడం వంటి చర్యలతో అర్హులైన వికలాంగులు తీవ్రంగా నష్టపోవడమే కాకుండా వారి జీవనం మరింత భారవుతుందన్నారు. తొలగించిన పింఛన్లను పునర్దించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, అధికార ప్రతినిధి ముద్వల సత్యంనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, పాలవలస మురళీకృష్ణ, జడ్పీటీసీలు అలజంగి రవికుమార్, బలగ నాగేశ్వరరావు, వైస్ ఎంపిపిలు సిద్దా జగన్నాథం, బి.రవికుమార్, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యాన జెసికి వినతిని అందజేస్తున్న వికలాంగులు

టిడిపి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

కమిషనర్ అవమానించారు

చైర్‌పర్సన్ గౌరీశ్వరి ఫిర్యాదు

ప్రజాశక్తి - పార్వతీపురం

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు తనను అవమానించారని ఆరోపిస్తూ మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్ లో జెసి ఎస్ ఎస్ శోబిక కి ఫిర్యాదు చేశారు.స్వాతంత్ర్య దినోత్సవం రోజున జెండా ఆవిష్కరణ కి తనను పిలిచి కమిషనర్ శ్రీనివాసరాజు గంటలతరబడి నిరీక్షణ చేయించిన తర్వాత ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తో ఆవిష్కరణ చేయించారని పేర్కొన్నారు.పట్టణ ప్రథమ పౌరురాలినైన తనని కమిషనర్ శ్రీనివాసరాజు అవమానించారని చెప్పారు.ప్రోటోకాల్ నిబంధనలు ఉల్లంఘించారని ఆయన పై చర్యలు తీసుకోవాలని కోరుతూ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి ఫిర్యాదు చేశారు.మాజీ ఎమ్మెల్యే జోగారావు కూడా ఆమె వెంట వున్నారు.

నాగరాజుకు మూడు టీచర్ పోస్టులు

ప్రజాశక్తి-పార్వతీపురం

మెగా డిఎస్‌సి ఫలితాల్లో బలిజిపేట మండలం పెదపెంకి గ్రామానికి చెందిన సారిపల్లి నాగరాజు ఏకంగా మూడు టీచర్ పోస్టులను కైవసం చేసుకున్నారు. నాగరాజు తల్లిదండ్రులు లక్ష్మీ, జనార్ధనరావు వ్యవసాయం చేస్తున్నారు. రైతు కుటుంబానికి చెందిన నాగరాజు ఎంఎ తెలుగు, ఎం.ఫిల్ తెలుగు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పూర్తి చేసి పట్టా పొందారు. ప్రస్తుతం అదే విశ్వవిద్యాలయంలో పిహెచ్‌డి చేస్తున్నారు. డిఎస్‌సి ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు విజయనగరం జిల్లా రెండవ ర్యాంకు, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (జోన్ 1) లో మూడో ర్యాంకు, టిజిటిలో ఆరోర్యాంకు సాధించారు. అయితే తెలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులో చేరుతానని ఈ సందర్భంగా నాగరాజు తెలిపారు.

హైకోర్టు జడ్జిగా మానవేంద్రనాథ్ రాయ్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణానికి చెందిన ప్రముఖ జడ్జి చీకటి మానవేంద్రనాథ్ రాయ్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమింపబడ్డారు. ఈయన గతంలో గుజరాత్ హైకోర్టు జడ్జిగా పని చేస్తూ ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ అయినట్టు సమాచారం. మానవేంద్రనాథ్‌రాయ్ నియమాకం పట్ల జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాకే అధ్యక్ష పదవి ఇవ్వాలి

టిడిపి బిసి, ఎస్‌టి నాయకుల్లో భిన్నాభిప్రాయాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

అరుకు పార్లమెంటు నియోజకవర్గాన్ని రెండు జిల్లాలుగా విభజించి అధ్యక్షులను నియమించాలని, మన్యం జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బిసి నాయకునికి అవకాశం ఇవ్వాలని కొంత మంది నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం విశాఖలో నిర్వహించిన అరుకు పార్లమెంటు నియోజకవర్గ పార్టీ సమావేశంలో నాయకులు విభిన్న వాదనలు వినిపించారు.మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, గణబాబు పరిశీలకులుగా హాజరైన సమావేశంలో నాయకులు తలోమాట చెప్పారు. అరుకు పార్లమెంటు నియోజకవర్గ పరిధి చాలా ఎక్కువగా ఉన్నందున రెండు జిల్లాలుగా విభజించి, వేర్వేరు కార్యవర్గాలను నియమించాలని పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల నాయకులు డిమాండ్ చేశారు .పార్వతీపురం జిల్లా అధ్యక్షుడిగా బిసిలకే అవకాశం ఇవ్వాలని కోరారు. మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ ఎస్టీలనే పార్టీ అధ్యక్షుడిగా నియమించాలని కోరారు. పార్టీ నాయకత్వంలో కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాల కు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే జగదీశ్వరి కోరారు. పార్టీ అధ్యక్ష బాధ్యతలు కావాలని రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు దరఖాస్తులు అందజేశారు. అధ్యక్ష బాధ్యతలు తాను చేపట్టలేనని మాజీ ఎమ్మెల్యే భంజ్ దేవ్ స్పష్టం చేశారు. ప్రస్తుత పార్టీ అధ్యక్షుడినే కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి కోరారు..నేతల అభిప్రాయాలను సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని పరిశీలకులు కొండపల్లి శ్రీనివాసరావు చెప్పారు.

డిజెకు అనుమతి లేదు

మట్టి విగ్రహాలనే వాడండి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

వినాయక ఉత్సవాల్లో డిజెలు పెట్టేందుకు అనుమతి లేదని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా ప్రజలకు పిలుపు నిచ్చారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సోమ వారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలంతా మట్టి గణపతినే పూజిం చాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన రంగు రంగుల గణపతి ప్రతిమలు, రసాయన రంగులతో చేసిన విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా జెసి ఎస్.ఎస్.శోబిక, జిల్లా పశు సంవర్ధక అధికారి ఎస్.మన్మధరావు, డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావుకు వినాయక మట్టి విగ్రహాలను కలెక్టర్ పంపిణీ చేశారు.

గణపతి నవరాత్రుల నేపథ్యంలో ఎక్కడా డీజేలకు అనుమతి లేదని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. శబ్ద కాలుష్యం లేకుండా మైక్ సెట్లు ఏర్పాటు చేసుకోవచ్చున్నారు. పోలీసుల అనుమతితో మండపాలు ఏర్పాటు చేసుకోవాలని, నిమజ్జనం సమయంలో ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవచ్చని తెలిపారు. నిమజ్జనం సమయంలో గజఈతగాళ్లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, డిఆర్ఒ కె.హేమలత, ఎస్డీసీ పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖాధికారులు కె.రాబర్ట్ పాల్, వై.క్రాంతి కుమార్, టి.కొండలరావు, ఎస్.భాస్కర రావు, ఐసిడిఎస్, డ్వామా పీడీలు టి.కనకదుర్గ, కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారి ఒ.ప్రభాకరరావు, సిపిఒ ఎస్ఎస్ఆర్‌కె పట్నాయక్, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులకు సమాచారాన్ని అందజేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు సరైన పరిష్కారాన్ని చూపాలని, లేకుంటే అందుకు గల కారణాలను ఖచ్చితత్వంతో కూడిన సమాచారాన్ని అందజేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను తేల్చి చెప్పారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, డిఆర్ఒ కె.హేమలత, ఎస్‌డిసి పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణిలతో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 107 మంది అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించిన కలెక్టర్, ప్రతి సమస్యను సావదానంగా విని, సమస్యకు తగిన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు అర్జీలను గమనించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, తద్వారా పెండింగ్ ఉండబోవని హితవు పలికారు. గ్రీవెన్స్‌లో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వికలాంగులకు ట్రై సైకిల్, ల్యాప్ టాప్‌లు పంపిణీ

జిల్లాకు చెందిన వికలాంగులకు ట్రై సైకిల్, ల్యాప్ టాప్‌లను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పంపిణీ చేశారు. స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో పార్వతీపురం నిర్మల కాలనీకి చెందిన చింతాడ గుంపయ్యకు ట్రైసైకిల్ ను మంజూరుచేసి, లబ్ధిదారునికి అందజేశారు. అలాగే సాలూరు నుంచి రాజాన గీత, కొమరాడ నుంచి దత్తి విష్ణు వర్ధన్ నాయుడు తమకు ల్యాప్ టాప్లను మంజూరు చేయాలని కోరగా, తక్షణమే కలెక్టర్ వాటిని మంజూరు చేశారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే పిజిఆర్ఎస్ కార్యక్రమమని, దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

సీతంపేట : సమస్యలను పరిష్కరించాలని పలువురు గిరిజనులు ఐటిడిఎ పిఒకు విన్నవించుకున్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాసమస్యలపై పరిష్కార వేదికలో పలువురు అర్జీదారుల నుంచి వినతిని స్వీకరించారు. వీరి సమస్యలను సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, ఇఇ రమాదేవి, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్ రావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యాం ప్రసాద్

జిల్లా పోలీసు కార్యాలయంలో...

పార్వతీపురం టౌన్ : ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లకు పరిష్కారం చూపాలని జిల్లా ఎఎస్‌పి అంకిత సురాన అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫిర్యాదుదారుల నుంచి వచ్చిన 3 అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. అర్జీదారుల సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్సై ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

డిగ్రీ పాఠ్యాంశాలలో గంటేడకు స్థానం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఉత్తరాంధ్ర జిల్లా లోని పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి చెందిన కథ, కవిత్వం, పాట, పద్యం అన్ని ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ప్రముఖ కథారచయిత గంటేడ గౌరునాయుడును డిగ్రీ పుస్తకాల్లో ఉన్నత విద్యామండలి పాఠంగా చేర్చినట్లు నిర్ణయం తీసుకుంది. పార్వతీపురానికి చెందిన కవి, గాయకుడు, రచయిత గంటేడ గౌరునాయుడు అనేక పుస్తకాలు, కవితలను రచించి స్నేహ కళా సాహితి సాహిత్య సంస్థను స్థాపించి ఎందరో కవుల్ని, కథకుల్ని తయారు చేసిన ఘనత ఆయనకే సొంతం.ఆయన రాసిన 'పాడుదుమా స్వేచ్ఛాగీతం'తో జాతీయస్థాయిలో ఎంతో ఖ్యాతిని ఆయనగడించారు. ఈ గేయాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం తెలుగు మాధ్యమ విద్యార్థుల తొమ్మిదో తరగతి పుస్తకంలో చేర్చింది. అటువంటి గంటేడ గౌరునాయుడు విశిష్టతను గుర్తించిన ఉన్నత మండలి డిగ్రీ రెండో సెమిస్టరులో గౌరునాయుడును దీర్ఘకవిగా విద్యార్థులకు పరిచయం చేయనుంది. వచ్చేఏడాది రానున్న పుస్తకంలో పాఠ్యాంశం ప్రచురితం కానుందని ఆయన తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖలో మూడు దశాబ్దాల పాటు ఉపాధ్యాయునిగా పనిచేసి నేడు పార్వతీపురం కేంద్రంగా సాహిత్య సృజనలో నిమగ్నమై సాహితీ లోకంలో తనదైన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్నారు. ఎన్నో సాహిత్య పురస్కారాలు, అవార్డులు, రివార్డులు, ప్రశంసలు అందుకోవడంతో పాటు ఆయన సాహిత్యంపై కూడా పలువురు పరిశోధనలు చేయడం గమనార్హం. గౌరునాయుడును ఉన్నత విద్యా మండలి డిగ్రీ పాఠ్యాం శంలో సాహితీవేత్తగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠ్యపుస్తకం ద్వారా పరిచయం చేయనుండడం పట్ల ఉత్తరాంధ్రకు చెందిన పలువురు సాహిత్య అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు..

సదస్సులో మాట్లాడుతున్న సౌమ్య జోషిప్

న్యాయ వ్యవస్థపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థులకు న్యాయ వ్యవస్థపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని కురుపాం జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సౌమ్య జోషిప్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పుడు నుండే సక్రమంగా చదువుకొని ప్రతి ఒక్కరూ లా కోర్సు చదివి లాయర్ వృత్తి చేపట్టి సమాజానికి ప్రజలకు చట్టాలు న్యాయవ్యవస్థ పై అవగాహన కల్పించేలా ఉండాలని సూచించారు. అనంతరం పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జె.గోపాలపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి సచివాలయ పరిధి జె.గోపాలపురంలో సోమవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, చిన్నారులు, మధుమేహ, రక్తపోటు తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.

22 కమ్యూనిటీ మరుగుదొడ్లు మంజూరు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో 22 కమ్యూనిటీ మరుగుదొడ్లు మంజూరైనట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం జెఇ డి.కావ్యశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరఘట్టంతో పాటు కంబర, చిట్టిపూడివలస, చినగోర, కత్తులకవిటి, హుస్సేనుపురం, తూడి, కుమ్మరిగుంట, పనస నందివాడ గ్రామాల్లో కమ్యూనిటీ మరుగుదొడ్లు నిర్మించినట్లు తెలిపారు. ఒక్కొక్క కమ్యూనిటీ మరుగుదొడ్డుకు రూ.3 లక్షలు అంచనా వ్యయంతో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు జెఇ తెలిపారు.

జిపిఎస్ పాఠశాల భవనం నిర్మించాలి

ప్రజాశక్తి- పార్వతీపురం

మండలంలోని రావికోన గ్రామపంచాయతీలో జిపిఎస్ పాఠశాల శిథిలావస్థకు చేరినందున వెంటనే పిల్లలకు అదనపు భవనం నిర్మించాలని కోరుతూ సర్పంచ్ రామస్వామి సోమవారం జెసి ఎస్ఎస్.శోభికకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిథిలావస్థలో ఉన్న భవనంలో 12 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఏమైనా జరిగితే ఎవరు బాధ్యులని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భవనం పాడైపోయి సుమారు 10 సంవత్సరాలైనా ప్రభుత్వ అధికారులు స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ఈ పిల్లలను వేరే తరగతి గదుల్లోకి తరలించాలని కోరారు. కొంతమంది గిరిజనులకు ఇచ్చిన పోడు పట్టాలు భర్తలు మరణించడంతో వారి భార్యల పేరిట మార్చాలని డిమాండ్ చేశారు.

వీరఘట్టంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ బి.వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఆయా శాఖలకు సంబంధించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరైనప్పటికీ వర్షం వల్ల ఫిర్యాదుదారులు రాలేదని ఎంపిడిఒ తెలిపారు.

వేతనాలు చెల్లించేదెప్పుడు?

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉపాధి హామీ చట్టం ద్వారా చేసిన పనులకు సంబంధించిన వేతనాలు ఎప్పుడు చెల్లిస్తారని వేతనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన వేతనాలు ఇప్పటి వరకు పైసా అందలేదని, శ్రమ తప్ప ఫలితం లేదని, వేతనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత డబ్బులు పెట్టుకుని ఆటో చార్జీలు కట్టుకొని దూరప్రాంతాలకు వెళ్లి పనులు చేశామని, కనీసం రవాణా ఛార్జీలు కూడా అందలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలలు గడుస్తున్నా చేసిన పనులకు వేతనాలు చెల్లించకపోతే తాము బతకడం ఎలా అంటూ వేతనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉపాధి హామీ పథకం అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించేందుకు తగు చర్యలు తీసుకోవాలని వేతన దారులు కోరుతున్నారు.

అన్నదమ్ములకు ఉపాధ్యాయ పోస్టులు

ప్రజాశక్తి - భామిని

ఉద్యోగానికి ఎంపికైన అన్నదమ్ములు

మండలంలోని బత్తిలి గ్రామానికి చెందిన తోట ఆనంద్, తోట వెంకటేష్ అనే ఇద్దరు అన్నదమ్ములు ఒకేసారి ఉపాధ్యాయ పోస్టులు సాధించి ఔరా అనిపించారు. డిఎస్‌సి 2025లో ఎస్‌జిటిలో తోట ఆనంద్ 87.97 మార్కులు సాధించి 29వ ర్యాంకు సాధించగా వెంకటేష్ 86.28 మార్కులు సాధించి ఎస్‌జిటిలో 54వ ర్యాంకు పొందాడు. తండ్రి తోట నరసింహులు టైలర్ వృత్తి చేస్తున్నప్పటికీ, తమను కష్టపడి చదివించారని అన్నదమ్ములు తెలిపారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, బంధువులు ఈ ఇద్దరు అన్నదమ్ములకు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు అట్టలు పంపిణీ

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని రేగులపాడు సచివాలయం పరిధి బొడ్లపాడు పాఠశాల విద్యార్థులకు సోమవారం జనసేన నాయకులు జనసేన జానీ, ఎం.పుండరీకం, కె.సాయిపవన్ పంపిణీ చేశారు. సమయానికి పాఠశాలకు చేరుకొని చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.

వైన్ షాపును పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

వైన్ షాపును పరిశీలించిన క్లూస్ టీం

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రంలో మక్కువ - దుగేరు రోడ్డులో ఉన్న నాయుడు వైన్స్‌లో శనివారం చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సోమవారం చోరీకి గురైన మద్యం దుకాణం, స్థలాన్ని స్థానిక ఎస్ఐ ఎం.వెంకటరమణ జిల్లా క్లూస్ టీమ్‌తో కలిపి పరిశీలించారు. చోరీ జరిగిన ప్రదేశం క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు క్లూస్‌ను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

అనారోగ్యంతో అంగన్వాడీ కార్యకర్త మృతి

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని సామరెల్లి అంగన్వాడి కార్యకర్త ఎం.శారద (32) అనారోగ్యంతో శ్రీకాకుళం ఆసుపత్రిలో వైద్యం పొందుతూ సోమవారం మృతి చెందారు. ఈమెకు ముగ్గురు పిల్లలు, భర్త పెంటయ్య ఉన్నారు. శారద మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తోటి ఉద్యోగులు సంతాపం తెలిపారు.

ఇరుకు గదుల్లో విద్యా బోధన

ప్రజాశక్తి - వీరఘట్టం

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ప్రభుత్వాలు ఆర్భాటంగా ప్రచారాలు చేస్తున్నయే తప్ప ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందంగా ఉంది సర్కారు బడుల్లో సమస్యలు కొలువై ఉన్నాయి. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో గల యు.వెంకంపేటలో మోడల్ ప్రైమరీ పాఠశాల ఉంది. ఇందులో సుమారు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 23 మంది విద్యార్థులు విద్యను కొనసాగిస్తున్నారు. గ్రామానికి నడి బొడ్డున ఈ పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఒకరు లోపల, మరొకరు ఆరుబయట విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్నారు. మరోవైపు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు వీలుగా వంటగది నిర్మించేందుకు స్థలం లేకపోవడంతో బోధన చేసిన గదిలోనే ఓ మూలన మధ్యాహ్న భోజనాన్ని నిర్వాహకులు సమకూరుస్తున్నారు. అంతేకాకుండా భోజనం అనంతరం విద్యార్థులు చేతులు, ప్లేట్లు కడుక్కునేందుకు వీలుగా ఏ విధమైన సదుపాయం లేకపోవడంతో పాఠశాలకు ఆనుకుని ఉన్న మరుగుదొడ్లులో వద్ద తినే ప్లేట్లను శుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు వాపోతున్నారు. విశ్రాంత సమయంలో విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు వీలుగా స్థలం లేకపోవడంతో పాటు రహదారికి పక్కన ఉన్నందున ఏ సమయంలో ఎటువంటి ప్రమాద వార్త వినాల్సి వస్తుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనం కూడా పూర్తిస్థాయిలో శిథిలావవస్థకు చేరుకోవడంతో అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాల వల్ల శ్లాబ్‌పై నుంచి వర్షం నీరు కిందకి జారడంతో గోడలు బీటలు వారడంతో పాటు అక్కడక్కడ శ్లాబ్ పెచ్చులూడి దర్శనమిస్తుంది. గ్రామంలో అదనపు పాఠశాల భవనం లేకపోవడంతో ఒకే వరలో రెండు కత్తుల అన్నట్టు ఇరుకైన గదిలో బోధించడం వల్ల పాటలు చెప్పే ఉపాధ్యాయులకు ఏం చెబుతున్నారో, విద్యార్థులు ఏం వింటున్నారో అర్థం కాని స్థితిలో ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదనపు భవనం నిర్మించేందుకు గ్రామంలో సెంటి స్థలం కూడా ప్రభుత్వం భూమి లేదని, ఉన్న భవనంలోనే మగ్గిపోవాల్సిన పరిస్థితి ఉందని, ఉన్న భవనాన్ని తొలగించేందుకు నిధులు కూడా లేకపోవడంతో శిథిలమైన భవనంలోనే కాలం గడపాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాల భవన నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు వద్ద 'ప్రజాశక్తి' ప్రస్తావించగా యు.వెంకంపేట పాఠశాలలో సమస్యలు ఉన్నాయని, వాస్తవమేనని, పాఠశాల స్థితిగతులు గూర్చి ఉన్నతాధికారులకు నివేదించినట్టు తెలిపారు.

తినే ప్లేట్లను మరుగుదొడ్డిలో కడుగుతున్న విద్యార్థులు

విద్యార్థులకు తప్పని అవస్థలు
యు.వెంకంపేట పాఠశాల దుస్థితి

ఇరుకు గదిలో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

రెండు జిల్లాలకు అధ్యక్ష పదవులు కేటాయించాలి

ప్రజాశక్తి- కొమరాడ

భౌగోళికంగా అరకు పార్లమెంట్ విస్తరణం ఎక్కువగా ఉన్నందున పార్వతీపురం మన్యం జిల్లాకు ఒక అధ్యక్ష పదవిని, అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఒక అధ్యక్షత పదవిని కేటాయించాలని కొమరాడ మండల టిడిపి కన్వీనర్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.ఉదయశేఖర్ పాత్రుడు కోరారు. ఈ మేరకు విశాఖపట్నంలో సోమవారం జరిగిన జిల్లా టిడిపి అధ్యక్షుడు ఎన్నికకు హాజరైన పార్టీ పరిశీలకులు విజయనగరం జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావుకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 7 నియోజకవర్గాలు ఉన్న అరకు పార్లమెంటులో పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలు ఉన్నాయని, పార్వతీ పురం మన్యం జిల్లాకు ఒక అధ్యక్ష పదవిని పార్టీ కేటాయించేలా చూడాలని కోరారు. ఇప్పటికే అన్ని పార్టీలు పార్వతీపురం జిల్లాకు జిల్లా అధ్యక్షుల నియామకాలు చేశారని గుర్తు చేశారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఒక అధ్యక్ష పదవిని కేటాయిస్తే పార్టీ కార్యకర్తలకు జిల్లా అధ్యక్షులు అందుబాటులో ఉండి వారి సమస్యలను పార్టీ అధ్యక్షునితో చెప్పుకునేందుకు వీలు ఉంటుందని అన్నారు.

గాలింపు చర్యలు చేపడుతున్న సిబ్బంది

మూడో రోజూ గాలింపు చర్యలు

ప్రజాశక్తి -భామిని

మండలంలోని లివరిలో కుమ్మరి లక్ష్మి శనివారం వంశధార నదిలో గల్లంతైన విషయం తెలిసిందే. లక్ష్మీ మతదేహం కోసం సోమవారం ఎస్డిఎఫ్ బృందాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం కూడా పూర్తిస్థాయిలో గాలింపు చర్యలు చేపట్టామని, వంశధార నదిలో గొట్ట బ్యారేజ్ వరకు ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు గాలింపు చేపట్టాయని, ఇంతవరకు లక్ష్మి మృతదేహం ఆచూకీ లభించలేదని బత్తిలి ఎస్ఐ అప్పారావు తెలిపారు. నది ప్రవాహం ఉధృతి దృష్ట్యా గాలింపు చర్యలకు కొంత ఆటంకం కలిగిందని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ శివన్నారాయణ, రెవెన్యూ పరిశీలకులు ప్రభాకర్, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

సిఐటియు ఆధ్వర్యంలో ఆటో కార్మికుల భారీ ర్యాలీ

ర్యాలీగా నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి - కొమరాడ

స్త్రీ శక్తి పథకంతో తీవ్రంగా ఆర్థికంగా నష్టపోయిన ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో సిఐటియు, శ్రీ మజ్జి గౌరీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకు ఆటో డ్రైవర్లు అందరూ ర్యాలీగా వెళ్లారు. అనంతరం తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణకు సమస్యలు పరిష్కరించాలని వినత పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆగస్టు 15నుంచి స్త్రీ శక్తి పథకం అమలు చేసి (మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసేలా అమలు చేస్తామని తెలిపారు. ఈ ఉచిత బస్సు ప్రయాణం మహిళలు కల్పించడంతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం తక్షణమే వాహన మిత్ర కింద రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించి అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఫ్రీ బస్ సౌకర్యంతో స్వయం ఉపాధి రంగంగా జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్ల తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. సొంత పెట్టుబడితో ఒకపక్క ఫైనాన్స్ కట్టుకోలేక ఆటోలు కొనేటప్పుడు అప్పులు చేసి డబ్బులకు వడ్డీలు కట్టుకోలేక, మరోవైపు ఆర్‌డిఒ ఆఫీసులో పన్నులు చెల్లిస్తూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా యువ గళం పాదయాత్రలో నారా లోకేష్ ఆటో రవాణా రంగా కార్మికులందరికీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చి, అధికారంలోకి వచ్చి 14 నెలలైనా హామీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదన్నారు. రవాణా రంగం నుంచి ప్రభుత్వం పన్నుల రూపంలో రూ. కోట్ల వసూలు చేస్తున్నప్పటికీ రవాణా రంగ కార్మికులకు ఇంతవరకు సంక్షేమ చట్టాన్ని రూపొందించకపోవడమేమిటని ప్రశ్నించారు. వాహన మిత్ర కింద రూ.పదివేల నుంచి రూ.15 వేలకు పెంచి ఇస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదని అన్నారు. కాబట్టి ఇలాంటి సందర్భంలో ఆటోడ్రైవర్లకు జరిగే నష్టానికి ప్రభుత్వం బాధ్యత తీసుకొని ఆర్థికంగా ఆదుకోవాలని, లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి వాహన మిత్ర పథకం ద్వారా రూ.25 వేలు సహాయం అందించాలని కోరారు. లేనిచో ఇంకా ఈ ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ మజ్జి గౌరమ్మ తల్లి ఆటో యూనియన్ నాయకులు బి.గోపి, కోరాడ చిన్న, బాసింగి శ్రీను, జైరాజేష్, బి.బుజ్జి, సంతోష్, రాకేష్, ఆనంద్, ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున తమ వాహనాలను పట్టుకొని పాల్గొన్నారు.

మైనింగ్‌పై తనిఖీలు నిర్వహించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్.

మండలంలో జరుగుతున్న బడిదేవరకొండ మైనింగ్‌పై తనిఖీలు నిర్వహించాలని కాంగ్రెస్ నాయకులు అధికారులను కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వి.దాలినాయుడు, కోలా కిరణ్ కుమార్, తీళ్ల గౌరీ శంకరరావు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వి.శ్రీహరి తదితరులు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభికను కలిసి బడిదేవరమ్మ కొండపై జరుగుతున్న మైనింగ్‌పై తనిఖీలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 100 మంది గిరిజనులకు పోడు పట్టాలిచ్చిన ప్రాంతంలో మైనింగ్‌కు అనుమతి ఇవ్వడమే పెద్ద పొరపాటన్నారు. మైనింగ్ బూడిద వల్ల గిరిజనులు సాగు చేస్తున్న జీడితోటలు పాడవుతున్నాయని గిరిజనులు ఆవేదన చెందుతున్నారన్నారు. అలాగే మైనింగ్ బూడిద వల్ల చెరువు కూడా కలుషితం అవుతుందన్నారు. చుట్టుపక్క నివాసిత గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. దాదాపు పది పంచాయతీలకు ఆరాధ్య దైవమైన బడిదేవరమ్మ కొండపైకి ప్రజలను మైనింగ్ యాజమాన్యం అనుమతించడం లేదని ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. తరతరాలుగా బడిదేవరమ్మ కొండను పూజిస్తున్న గిరిజనుల మనోభావాలు మైనింగ్ వలన దెబ్బతిన్నాయన్నారు. మైనింగ్ వల్ల పర్యావరణానికి హాని కలుగుతుంది అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు కంటే పరిధి దాటి ఈ ప్రాంతాన్ని కలుషితం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తక్షణమే తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని అందజేశారు.

జిసిసి డైరెక్టర్‌గా నిబ్రహం ప్రమాణ స్వీకారం

సీతంపేట : రాష్ట్ర జిసిసి డైరెక్టర్‌గా నిమ్మల నిబ్రహం సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. భామిని మండలం హనుమకొండకు చెందిన నిబ్రహం జనసేన సీనియర్ నాయకులు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిసిసి ద్వారా గిరిజనులకు నాణ్యమైన నిత్యవసర సరుకులు సకాలంలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో పాతపట్నం, సీతంపేట జిసిసి మేనేజర్లు జి.నరసింహులు, డి.కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్‌వర్కర్ల వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- పార్వతీపురం

నిరసన తెలుపుతున్న ఆశా, హెల్త్ వర్కర్లు

జిల్లాలో వున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల 4 నెలల బకాయి వేతనాలు చెల్లించాలనీ కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆశా వర్కర్ల సంఘం, సామాజిక ఆరోగ్య కార్యకర్తల సంఘం నాయకుల ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమం ఉద్దేశించి ఆశా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శివాని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ జిల్లా నాయకులు కె.బృందావతి మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో ఆశా, సామాజిక ఆరోగ్య కార్యకర్తల పాత్ర కీలకమన్నారు. ఆశా వర్కర్లతో సమానంగా సామాజిక ఆరోగ్య కార్యకర్తల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలల వేతన బకాయిలను చెల్లించాలని కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షులు సిఐటియు జిల్లా నాయకులు వి.ఇందిరా, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై మన్మధరావు, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, అంగన్వాడీ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం ఉమామహేశ్వరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆశా, సిహెచ్‌డబ్ల్యుల వర్కర్స్ యూనియన్ పార్వతిపురం మన్యం జిల్లా కమిటీ, పీహెచ్ కమిటీలు నాయకులు మహాలక్ష్మి, చిన్నమ్ములు, దమయంతి, రాజేశ్వరి, కవిత, శుభశ్రీ, ఎస్. లక్ష్మి, రత్నం, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు గవర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఆహార పొట్లాలను అందిస్తున్న నిర్వాహకులు

పట్టణంలో విజయదుర్గ ఆటో డ్రైవర్లు యూనియన్ మామిడిపల్లి, తోనం, మామిడిపల్లి, కురుకుట్టి స్టాండ్ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు 60 మందికి అన్నదానం సోమవారం నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన కార్మిక సంఘాల నాయకులు సిద్ధబత్తుల రామచంద్రరావును స్మరించుకుంటూ సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు ఆటో డ్రైవర్ల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సంతోష్ మాట్లాడుతూ రామచంద్రరావు ఎంతోమంది నిరుపేదలకు, కార్మికులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలను గుర్తించి, అవి పరిష్కారమయ్యేంత వరకు పోరాడిన వ్యక్తని అన్నారు. అటువంటి వ్యక్తి సేవలను గుర్తుంచుకోవడానికి కార్మికుల తరుపున ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం జయప్రదమయ్యేందుకు సహకరించిన పెద్దలందరికీ ఆటో యూనియన్ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని, భవిష్యత్తులో కూడా ఆటో డ్రైవర్లు యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆటో సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి సందర్శన

ప్రజాశక్తి - కురుపాం

రికార్డులను తనిఖీ చేస్తున్న డిపిఎంఒ రఘుకుమార్

మండలంలో మొండెంఖల్ పిహెచ్‌సిని జిల్లా ప్రోగ్రామ్ మోనిటరింగ్ అధికారి (డిపిఎంఒ) డాక్టర్ పి.ఎల్.రఘు కుమార్ స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం అకస్మికంగా సందర్శించి, తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రికార్డులను, ల్యాబ్ గదులను, రోగులు ఉంటున్న వార్డులను క్షుణంగా పరిశీలించి రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు గూర్చి ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో ఆయన మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు వారు ఉండే వార్డుల్లోనూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా సిబ్బంది బాధ్యత తీసుకొని రోగులతో స్నేహభావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ నాగేశ్వరరావు, హెల్త్ సూపర్వైజర్లు సుగుణ, జె.తిరుపతిరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నాటుసారాతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెంఖల్‌లో సోమవారం నీలకంఠాపురం ఎస్ఐ ఎ.నీలకంఠరావు తన సిబ్బందితో కలిసి జరిపిన దాడుల్లో జి.చంద్రశేఖరరావు అనే వ్యక్తి నాటు సారా అమ్ముతుండగా పట్టుకొని 20 లీటర్ల సారాను స్వాధీనపర్చుకొని అతనిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నాటు సారా ఎవరైనా అమ్మినా, తయారు చేసినా, రవాణా చేసినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లో అటువంటి కార్యక్రమాలు ఎవరైనా చేపడుతుంటే తమకు సమాచారం ఇచ్చి నాటు సారారహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రెగ్యులర్ డిఇఒ, డిడిలను నియమించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం జిల్లాకు రెగ్యులర్ డిఇఒ(జిల్లా విద్యాశాఖ అధికారి)ను, పార్వతీపురం ఐటిడిఎకు రెగ్యులర్ డీడీ (డెప్యూటీ డైరెక్టర్)ను నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఇప్పుడున్న వారిలో ఒకరు ఎంఇఒ, మరొకరు సహాయ గిరిజన సంక్షేమ అధికారని చెప్పారు. వీరి నిర్లక్ష్యం, పనితీరు వల్ల పూర్తిగా మన్యం జిల్లాలో ప్రభుత్వ విద్యా రంగం నాశనమవుతోందన్నారు. వరుసగా పదో తరగతి పరీక్షా ఫలితాల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన జిల్లాకు రెగ్యులర్ డిఇఒ, డిడిలను నియమించలేని బాధ్యత లేని కూటమి ప్రభుత్వం తీరుపై కలిసి వచ్చే అన్ని విద్యార్థి, గిరిజన, ప్రజా సంఘాలతో పోరాటం చేస్తామని తెలిపారు. అలాగే పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎలకు రెగ్యులర్ పిఒలను నియమించాలని డిమాండ్ చేశారు.

కూలిన ఇంటి గోడ

ప్రజాశక్తి - కొమరాడ

గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు ఇంటి గోడ కూలిన ఘటన మండలంలో పరుశురాంపురం గ్రామంలో చోటు చేసుకుంది. సోమవారం తెల్లవారుజామున అకాల వర్షానికి కొత్తకోట బాలకృష్ణ పాత్రుడు, సత్యనారాయణ పాత్రుడుకి చెందిన ఇంటి గోడ కూలిపోయింది. ఇంటి గోడ కూలిన సమయంలో ఆ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా ముసిరితో కూడిన వర్షం పడడంతో మట్టి గోడలో నానిపోయి పడిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. గోడ కూలిపోవడంతో ఇంట్లో సామాగ్రి అంతా నేలమట్టం కావడం ఆస్తి నష్టం జరిగినట్లు భాయ్ తెలిపారు. బాధితుడికి ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందించాలని బాధి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఆ బాధ్యత కమిటీ సభ్యులదే : సిఐ

ప్రజాశక్తి - వీరఘట్టం

ఈనెల 27వ తేదీ నుండి జరగనున్న వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా మండపాల వద్ద ఏమి జరిగినా దానికి బాధ్యత కమిటీ సభ్యుల దేనిని పాలకొండ సిఐ ఎం.చంద్రమౌళి కమిటీ సభ్యులకు సూచించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నడిమికెళ్ల గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతేడాది మండలంలో ఎక్కడ మండపాలు వద్ద ఏ విధమైన ఘటనలూ జరగలేదని, నడిమికెళ్ల గ్రామంలో జరిగిందని మరలా ఆ పరిస్థితి పునరావృతం కాకుండా భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అందరూ కలిసికట్టుగా ఉండి వినాయక ఉత్సవాలు ఘనంగా జరిపించుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుల అనుమతి తీసుకుని మండపాలను నిర్వహించాలన్నారు. అనుమతి లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో స్థానిక ఎస్ఐ జి.కళాధర్, నడిమికల గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీతానగరం: వినాయక చవితి మంటపాలు ఏర్పాటుకు పోలీసు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీతానగరం ఎస్ఐ ఎం రాజేష్ సూచించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు అనుమతి లేకుండా వినాయక చవితి మండపాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు కోసం ఆన్‌లైన్, నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న తరువాత పోలీసులు మండపాలను పరిశీలించి తగు తాత్కాలిక రుసుం కట్టించుకొని మండపాలకు నిబంధనల మేరకు అనుమతులు ఇస్తామన్నారు. పోలీసు అనుమతి లేకుండా మండపాలు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యత వహించాలన్నారు.